సనత్‌నగర్ పోలీసులకు రివార్డులు


రివార్డులు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి

సనత్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల సమయంలో చెకింగ్ పాయింట్ల వద్ద నిరంతర విధులు నిర్వర్తిస్తూ అక్రమంగా తరలిస్తున్న నగదును పట్టుకోవడంలో విశేష కృషి చేసిన పోలీసు సిబ్బందికి గురువారం ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి రివార్డులను అందజేశారు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు, రైటర్ సతీష్‌కుమార్, ఏఎస్‌ఐ ముజఫర్, కానిస్టేబుల్ శేఖర్ ఇన్‌స్పెక్టర్ చేతుల మీదుగా రివార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అవార్డులు, రివార్డులు అనేవి మరింత ఉత్సాహంగా విధులు నిర్వర్తించడంలో కీలకంగా పనిచేస్తాయన్నారు. ఎన్నికల వేళ చెకింగ్ పాయింట్ల వద్ద నిరంతరాయంగా విధులు నిర్వర్తిస్తూ సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రూ.22.82 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎండలను సైతం లెక్కచేయకుండా ఎన్నికల విధుల్లో సిబ్బంది నిమగ్నమై సమర్థవంతంగా తమ విధులు నిర్వర్తించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఐ నాగిరెడ్డి, ఎస్‌ఐలు కృష్ణగౌడ్, అబ్దుల్ ఫయీమ్, హరీష్, సుశీల రాధాకృష్ణన్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

22న అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం

పీసీబీ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు

సనత్‌నగర్: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 22 రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ తెలిపారు. జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది ప్రాధాన్యం అంశంగా 'ప్రణాళికలో భాగం' థీమ్‌ను ఐక్యరాజ్యసమితి నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రకృతిని రక్షించడంతో పాటు పునరుద్ధరించడానికి, ప్రకృతి అనుకూలంగా అభివృద్ధి చెందడానికి, పర్యావరణ వనరులను న్యాయంగా పంచుకోవడంతో పాటు ప్రకృతి కోసం పెట్టుబడి పెట్టి సహకరించే పని మొదలుపెట్టడానికి అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సరైన అవకాశంగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో టీఎస్‌పీసీబీ పాఠశాల విద్యార్థులను జూనియర్లు, సబ్ జూనియర్లు, సీనియర్లు మూడు గ్రూపులుగా విభజించి చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 22న ఉదయం 10 గంటల నుంచి సనత్‌నగర్‌లోని టీఎస్‌పీసీబీ కార్యాలయం ఆడిటోరియంలో పోటీలు ఉంటాయన్నారు.ఆసక్తి గల విద్యార్థులు నేరుగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయానికి వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 99081 79676 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నీటి సరఫరా ఆగిపాయె.. పచ్చదనం ఎండిపాయె

ఓయూకు హుస్సేన్‌సాగర్ నీటి సరఫరా బంద్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు వంద సంవత్సరాలుగా సరఫరా అవుతున్న హుస్సేన్‌సాగర్ నీళ్లు నిలిచిపోయాయి. దీంతో యూనివర్సిటీ క్యాంపస్‌లోని అతిపెద్దదైన ల్యాండ్‌స్కేప్ గార్డెన్‌తో పాటు వివిధ కాలేజీలు, కార్యాలయాలలోని పూల తోటలు, పచ్చిక మైదానాలు ఎండిపోతున్నాయి. ఓయూకు నీటి కొరత లేకుండా ఉండేందుకు వందేళ్ల క్రితం భూగర్భ పైపులైను ద్వారా 24 గంటలు నీటి సరఫరా చేశారు. నిరంతరాయంగా కొనసాగుతున్న నీటి సరఫరా గతేడాది ఇందిరా పార్కు సమీపంలో పైపులైన్ కోసం చేపట్టిన తవ్వకాలలో ఓయూకు వచ్చే నీటి సరఫరా పైపులైను పగిలిపోయింది. ఓయూ అధికారులు అనేక ప్రయత్నాలు చేసిన ఎవరూ స్పందించలేదు. బోర్ల ద్వారా గార్డెన్లు, పచ్చిక మైదానాలకు నీటి సరఫరా చేస్తున్నారు. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి సరిపడ నీరు రావడం లేదు. దీంతో క్యాంపస్‌లో పచ్చదనం ఎండిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి హుస్సేన్‌సాగర్ నీరు ఓయూకు పునరుద్ధరించాలని విద్యార్థులు కోరుతున్నారు.


ఎండిపోతున్న ల్యాండ్‌స్కేప్ గార్డెన్

గాంధీ మార్చురీ దుర్వాసన భరించలేకపోతున్నాం

అభినవ్‌నగర్‌కాలనీ వాసుల ఆవేదన

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి మార్చురీ నుంచి వెలువడే దుర్వాసనతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని పద్మారావునగర్ అభినవ్‌నగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, సభ్యుడు చంద్రపాల్‌రెడ్డి గురువారం గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వినయ్‌శేఖర్ కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్చురీకి ఆనుకుని కాలనీ ఉందని, మృతదేహాలను భద్రపరిచే ఫ్రిజర్ బాక్స్‌లు, పర్ఫ్యూమ్‌ల ఏయిర్ కండిషన్ పనిచేయకపోవడంతో కుళ్లిన శవాల నుంచి దుర్వాసన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీకి ఆనుకుని మార్చురీ ఏర్పాటు చేయొద్దని ఆస్పత్రి నిర్మిస్తున్న సమయంలోనే అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించామని అప్పటికే మార్చురీ నిర్మాణం పూర్తికావడంతో కాలనీవాసులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని వైద్య ఉన్నతాధికారులు, ఆస్పత్రి పాలనా యంత్రాంగానికి కోర్టు ఆదేశించిందని గుర్తుచేశారు. వైద్య ఉన్నతాధికారులు స్పందించి సమస్యను తక్షణమే పరిష్కరించాలని లేకుంటే ఆస్పత్రి ప్రాంగణంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


వినతిపత్రం ఇస్తున్న కాలనీ ప్రతినిధులు

తీన్‌మార్ మల్లన్నను ఓడించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రానున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న తీన్‌మార్ మల్లన్నను ఓడించాలని ఓయూ విద్యార్థి జేఏసీ నేత, తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతి చిన్న విషయాన్ని ప్రశ్నించిన మల్లన్న కాంగ్రెస్ పాలనలో జరిగే అన్యాయాలపై నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. జీవో 46 బాధితులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తే నిమ్మకు నీరెత్తన్నట్లు ఉన్నారని మల్లన్నపై ధ్వజమెత్తారు. ఉద్యమకారులను గుర్తించని కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న మల్లన్నను ఓటమి కోసం ప్రచారం చేస్తామన్నారు.

అక్రమ నిర్మాణం.. ఎందుకో అధికారుల మౌనం?


షెడ్ వెనుక వైపు కొంచెం కూల్చివేస్తున్న అధికారులు


మిగతా షెడ్ అలానే ఉన్న దృశ్యం

- ఫిర్యాదు చేస్తేనే కూల్చేస్తారు
- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

లాలాపేట: అక్రమ నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిన జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజల నుంచి ఫిర్యాదు వస్తే తప్పా స్పందించడం లేదు. లేదా వార్తా కథనాలు వస్తేనే అప్రమత్తమవుతున్నట్లు నటిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. తాజాగా సరిగ్గా ఇలాంటి ఘటనే లాలాపేటలో జరిగింది. లాలాపేట రామ్ థియేటర్ పక్క రోడ్డులో ఓ వ్యక్తి ఏలాంటి అనుమతులు లేకుండా భారీ షెడ్‌ను నిర్మాణం చేశారు. నిర్మాణం చేసి చాలా రోజులైంది. ఈ విషయం జీహెచ్‌ఎంసీ అధికారులకు తెలిసినా తెలియనట్లుగానే ఉన్నారు. దీనిపై కొందరు స్థానికుల వరుస ఫిర్యాదులతో గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారులు వచ్చి షెడ్‌ను పూర్తిగా తొలగించకుండా నామమాత్రంగానే కూల్చి వేసి తమ పని అయిపోయిందని వెళ్లిపోయారు. పూర్తిగా తొలగించకుండా వెళ్లిపోవడంతో స్థానికులు అధికారుల తీరుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


అమీర్‌పేట ప్రధాన రహదారిలో రోడ్డును ముంచెత్తిన వాన

ఉదయం ఉక్కపోత సాయంత్రం కుండపోత

ఉదయం ఉక్కపోత ఉండి సాయంత్రం చల్లటి వాతావరణంతో మొదలైన వాన ఒక్కసారిగా కుండపోతగా కురవడంతో క్షణాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. నగరంలో గురువారం కురిసిన వర్షానికి జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.
–సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్ల బృందం


రోడ్డుపై ఓ పక్క నీరు నిల్వడంతో రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనదారులు


బేగంపేట ప్రధాన రహదారిలో సహాయక చర్యలు చేపడుతున్న ట్రాఫిక్ పోలీసులు


వాహనదారులకు సూచనలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు




రిలయన్స్ స్మార్ట్ షోరూమ్ వద్ద


బేగంపేట ఆర్‌యూబీ వద్ద..

- తార్నాక, లాలాపేట, మాణికేశ్వర్‌నగర్ ప్రాంతాల్లో నాలాలు, డ్రైనేజీలు, మ్యాన్‌హోళ్లు పొంగి కాలనీ, బస్తీల రోడ్లపై వరద పారింది.
- మైత్రీవనమ్ చౌరస్తాలో ఎప్పటిలాగే రోడ్డుపై పెద్ద ఎత్తున వర్షపు నీరు నిల్వడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- బేగంపేటకు వెళ్లే మార్గంలో రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన నీటిలో కార్లు, ద్విచక్ర వాహనాలు మునిగిపోయాయి.
- సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ, మైలార్‌గడ్డ, శ్రీనివాసనగర్‌లో వరదనీరు రహదారులపై నిలిచిపోవడంతో కార్పొరేటర్ సామల సమాచారంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది రంగంలోకి దిగి సమస్యను పరిష్కరించారు.
- చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.
- అమీర్‌పేట, ఎస్‌ఆర్‌నగర్, ఎర్రగడ్డ, బేగంపేట ప్రధాన రహదారుల్లో భారీగా వరద నీరు చేరడంతో కిలోమీటర్ల మేర వాహనాలు స్తంభించిపోయాయి.
- బేగంపేటలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు ప్రత్యేక చొరవతో చీకోటి గార్డెన్స్ ఎదురుగా బేగంపేట ప్రధాన రహదారిలో నిలిచిన వరదనీటిని మళ్లించేందుకు సహాయక చర్యలు కొనసాగాయి.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 32, చామగడ్డ 45, మొరంగడ్డ 35, కందగడ్డ 70, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 8, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

కారును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- బేగంపేట ఫ్లై ఓవర్‌పై ట్రాఫిక్ జామ్



సనత్‌నగర్: బేగంపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కారును వెనుక నుంచి వచ్చిన ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 8 గంటల సమయంలో అమీర్‌పేట నుంచి బేగంపేటకు వెళ్తున్న కారును వెనుక నుంచి వస్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టగా కారు రోడ్డుకు అడ్డంగా తిరగడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన కారును క్రేన్ సహాయంతో తొలగించి రాకపోకలను పునరుద్ధారించారు.

అనుభవమున్న ప్రొఫెసర్లనే వీసీలుగా నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వీసీల నియామకాల్లో అక్రమంగా సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందిన అధ్యాపకులను దూరం పెట్టాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. గురువారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బోధన, పరిపాలన అనుభవం గల ప్రొఫెసర్లనే వీసీలుగా నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ ఓయూ అధ్యక్షులు లెనిన్, కార్యదర్శి సత్య, భగత్, శేఖర్, అశ్విన్ పాల్గొన్నారు.

'మృగశిర'ను చేపల పండగగా నిర్వహించాలి

పంజగుట్ట: త్వరలో మృగశిర కార్తె రానున్న నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో చేపల పండగ (ఫిష్ ఫెస్టివల్) నిర్వహించేలా ముఖ్యమంత్రి ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ ముదిరాజ్ మహా సంఘం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మత్స్యకారులకు గతంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉచిత చేపపిల్లల పంపిణీ చేసేవారన్నారు. ఈ ప్రభుత్వంలో కూడా ఆ పథకాన్ని కొనసాగించాలని కోరారు. చేపల పంపిణీలో ఏమైనా లోటుపాట్లు ఉంటే రాష్ట్రంలోని మత్స్య సహకార సొసైటీలను నేరుగా నగదు పంపిణీ చేయాలని కోరారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణలోనే అతిపెద్ద కులం అయిన ముదిరాజ్‌లకు మంత్రి పదవి కేటాయిస్తానని హామీ ఇచ్చారని, ముదిరాజ్‌లు ఎన్నో సంవత్సరాలుగా పోరాడుతున్న బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మారుస్తానని ప్రకటించారని గుర్తుచేశారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దత్తు ప్రకటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర నాయకులు బొక్క శ్రీనివాస్, ఉప్పరవేణి రంజిత్, సుంకర మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

భర్త డ్యూటీకి వెళ్లొచ్చేలోగా భార్య అదృశ్యం

వెంగళరావునగర్: భర్త డ్యూటీ నుంచి ఇంటికి వచ్చేలోగా భార్య అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్ గురుద్వార్ గల్లీలో నివసించే పులుసు రామిరెడ్డి చెఫ్‌గా పనిచేస్తుంటాడు. 2017లో సుధ అనే యువతితో వివాహమైంది. వారికి ఒక పాప ఉంది. ఇటీవల ఆమె తన మాజీ స్నేహితుడు క్రాంతితో ఇన్‌స్టాగ్రామ్‌లో మాట్లాడుతోంది. విషయం తెలిసిన రామిరెడ్డి తన తల్లిదండ్రుల ద్వారా సుధకు కౌన్సెలింగ్ ఇప్పించాడు. మరోసారి అతనితో మాట్లాడవద్దని చెప్పారు. ఈ నెల 14న రామిరెడ్డి విధులకు వెళ్లి రాత్రికి ఇంటికి వచ్చేలోగా ఇంటికి తాళాలు వేసి ఉంది. సీసీ టీవీలో పరిశీలించగా ఆమె తన కుమార్తెతో కలిసి తన దుస్తులు సర్దుకుని వెళ్లిపోయినట్టు గుర్తించాడు. రామిరెడ్డి ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. పలు ప్రాంతాల్లో వెతికిన అనంతరం గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విన్యాసం.. అద్భుతం





ఆసియాలోనే అతిపెద్ద సర్కస్‌గా పేరు గాంచిన గ్రేట్ బాంబే సర్కస్ వేసవి సెలవుల్లో జంటనగర వాసులకు విశేషంగా అలరిస్తోంది. ఈ సర్కస్‌లో 60 అడుగుల ఫ్లయింగ్ ట్రాపెజ్ కళాకారుల స్కైవాక్, అమెరికన్ ట్రాంపోలిన్, ఇథియోపియన్ ఐకారియన్ యాక్ట్, రష్యన్ కళాకారుల రింగ్ డాన్స్, ఫైర్ డాన్స్ ఆకట్టుకుంటున్నాయి. –రసూల్‌పురా

ఘనంగా ఈదమ్మ దేవాలయం ప్రతిష్ఠ ఉత్సవాలు


బోనాలు సమర్పిస్తున్న భక్తులు

లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో గురువారం ఈదమ్మ తల్లి దేవాలయం ప్రతిష్ఠ ఉత్సవాలు, శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ నూతన భవనం ప్రారంభోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీలోని బొడ్రాయికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బస్తీ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు డిప్యూటీ మేయర్ తెలిపారు. పూజల్లో గండికోట కుమార్, శ్రీనివాస్, కిరణ్, వెంకటేష్, కుమార్, యాదయ్య, గిరి పాల్గొన్నారు.

కొమురవెల్లిలో ప్రత్యేక పూజలు



అడ్డగుట్ట: సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ భారీ మెజారిటీతో గెలుస్తున్నారని ఆ పార్టీ సీనియర్ నాయకురాలు గీతా దయాకర్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం శాంతినగర్‌కు చెందిన మహిళా కార్యకర్తలతో కలిసి ఆమె కొమురవెల్లి మల్లన్న దేవాలయానికి వెళ్లి పద్మారావుగౌడ్ భారీ మెజారిటీతో గెలుపొందాలని ప్రత్యేక పూజలు చేయించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడే ప్రజల మనిషి పద్మారావుగౌడ్ అని గీతా దయాకర్ పేర్కొన్నారు. పూజల్లో సుగంధ, శోభ, అనసూయ పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో సత్తా


అలీషా సాహూ | రిషిక | తన్మయి | షేక్ రబీహా

లాలాపేట: ఇటీవల వెలువడిన సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో తార్నాక డివిజన్ శాంతినగర్‌లోని తక్షశిల స్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు డైరెక్టర్ భాగ్యలక్ష్మీ, హెచ్‌ఆర్ భానుశ్రీ, ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్ తెలిపారు. తమ పాఠశాలకు చెందిన అలీషా సాహు 481/500 సాధించి స్కూల్ టాపర్‌గా నిలువగా మరో 39 మంది 'ఏ' గ్రేడ్ సాధించారని పేర్కొన్నారు. విజయ్ కశ్యప్, శ్రీరామ సుబ్రమణియం, దిశ, అలీషా సాహూ, తన్మయి, రిషిక, షేక్ రబీహ ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు.